

చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



టమాట కిలో రూ.14

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.14, కనిష్టం రూ.4, సరాసరి రూ.10 పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
36.1°/14.3°

జిల్లా అంతటా సోమవారం పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. వేకువజామున చలి వాతావరణం కొనసాగింది. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ఉగాదికి 20 వేల ఇళ్లు పూర్తి కావాలి

అనంతపురం టౌన్: 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉగాది పండుగలోపు 20 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కేశవనాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం గృహ నిర్మాణ సంస్థ డీఈ, ఏఈలతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 10 వేల ఇళ్ల నిర్మాణాలు 100 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించే దిశగా ఏఈలు చర్యలు చేపట్టాలన్నారు. బిల్లులు సైతం సకాలంలోనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీల్లో హౌసింగ్ సిబ్బంది అందుబాటులో ఉండి ఆప్షన్–1 ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి రోజు వారి నివేదికలను ఉన్నతాధికారులకు అందించాలన్నారు.

హెపటైటిస్ బీ వ్యాక్సిన్ వేయించుకోండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం సప్తగిరి సర్కిల్: హెచ్ఐవీ బాధితులు ఏఆర్‌టీ కేంద్రాల్లో ఉచితంగా హెపటైటిస్ బీ వ్యాక్సిన్ వేయించుకోవాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ సూచించారు. నగరంలోని సర్వజనాస్పత్రి ఏఆర్‌టీ కేంద్రంలో హెపటైటిస్ బీ వ్యాక్సినేషన్ పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. హెచ్ఐవీ బాధితులకు, ఏఆర్‌టీ కేంద్రాల్లో చికిత్స పొందుతున్న వారికి ఈ నెల ఆరో తేదీ నుంచే హెపటైటిస్ బీ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందిస్తున్నామన్నారు. అనంతపురం సర్వజనాస్పత్రి, కదిరి ఏరియా ఆస్పత్రి, ఆర్డీటీ బత్తలపల్లి ఏఆర్‌టీ కేంద్రంలో అందుబాటులో ఉంచామన్నారు. వ్యాక్సిన్‌కు వచ్చే ఆధార్ వెంట తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సత్యనారాయణ, సిబ్బంది వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ బడ్జెట్ రూపకల్పన


అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ రూపకల్పనలో జిల్లా పరిషత్ అధికారులు బిజీ అయ్యారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆదేశాల మేరకు సీఈఓ కె.భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ జల్లా శ్రీనివాసులు, గణాంకాధికారి అమృత్‌రాజ్ ఆధ్వర్యంలో బడ్జెట్ రూపొందిస్తున్నారు. ఇందుకు సంబంధించి జెడ్పీ సహా అనుబంధ శాఖల నుంచి సమగ్ర వివరాలు తెప్పించుకొని వాటిని క్రోడీకరించుకున్న తరువాత వచ్చే నెలలో జరిగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు. అనంతపురంలో ఒక్క ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ మినహా మిగిలిన అన్ని శాఖల నుంచి సమాచారం తెప్పించుకున్నట్లు డిప్యూటీ సీఈఓ శ్రీనివాసులు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బడ్జెట్ పంపడంలో ఆలస్యమైంది. ఆ శాఖ వివరాలు రాగానే పూర్తి స్థాయిలో బడ్జెట్ రూపుదిద్దుకోనుంది.

సీజ్ చేసిన బియ్యం 13న వేలం

అనంతపురం అర్బన్: జిల్లాలో 6–ఏ కేసుల్లో సీజ్ చేసి ఎంఎల్ఎస్ పాయింట్లలో నిల్వ చేసిన 603.25 క్వింటాళ్ల బియ్యాన్ని ఈ నెల 13న వేలం వేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన ట్రేడర్లు, రైస్ మిల్లర్లు, వ్యాపారులు ఈ నెల 13 సాయంత్రం మూడు గంటల్లోగా దరఖాస్తులను కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా సరఫరాల అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు బుద్ధప్పనగర్‌లోని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కార్యాలయంలో వేలం ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ప్రవేశ రుసుము రూ.లక్ష మొత్తాన్ని డీడీ రూపంలో తీసుకుని దరఖాస్తుతో పాటు జతచేయలని సూచించారు. బహిరంగ వేలం అనుమతించేందుకు, రద్దు చేసేందుకు జాయింట్ కలెక్టర్‌కు అధికారం ఉంటుందని పేర్కొన్నారు.

118 మొబైల్ ఫోన్ల రికవరీ

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: జిల్లా వ్యాప్తంగా వారం రోజుల్లో 118 ఫోన్లు రికవరీ చేశామని 'దిశ' డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల్లో ఉంటున్న బాధితులకు ప్రొఫెషనల్ కొరియర్ ద్వారా ఆరు ఫోన్లు పంపించామన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ విభాగం ఎస్ఐ సుధాకర్ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.



- ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ముందస్తు అడ్మిషన్లు
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలు
- జిల్లాలో కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్

- అనంతపురం శివారులో కొత్తగా సీబీఎస్ఈ సిలబస్‌తో బోధన చేస్తున్న ఓ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీకి అక్షరాలా లక్ష రూపాయల ఫీజు వసూలు చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి ముందస్తుగా సీటు బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ ఇస్తామని తాయిలాలు ప్రకటిస్తున్నారు. ఒకే దఫా ఫీజు వసూలు చేసుకుంటే తల్లిదండ్రులు ఇతర పాఠశాలల్లో అడ్మిషన్ చేయించుకోలేరన్నది వారి వ్యాపార ఎత్తుగడ.
- హైదరాబాద్‌లోని కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ కోర్సుల్లో అడ్మిషన్లు చేయించుకోవడానికి జిల్లాలోని తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇదే అదనుగా ఈ – టెక్నో కోర్సులకు ఏడాదికి రూ.2 లక్షలు వసూలు చేస్తున్నారు. ముందస్తుగా అడ్మిషన్ ఫీజు రూ.12 వేలు చెల్లించి సీటు బుక్ చేసుకోవాలని సూచిస్తున్నారు. ఎంత ఎక్కువ ఫీజు అయితే అంత ఎక్కువ విలువ ఉంటుందన్న భ్రమలో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు అడ్మిషన్లు తీసుకుంటున్నారు.

దందా మొదలైంది

అనంతపురం: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ముందస్తు అడ్మిషన్లు జోరందుకున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం ముగియక ముందే జిల్లా వ్యాప్తంగా నూతన అడ్మిషన్లకు తెరలేపాయి. ముందస్తు ప్రవేశాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేసే ప్రక్రియ ప్రారంభమైంది. టెక్నో, ఈ–టెక్నో, ఈ స్మార్ట్ అంటూ రకరకాల పేర్లతో అడ్మిషన్ల దందాకు దిగాయి. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు సీటు బుక్ చేసుకుంటే ఫీజులో రాయితీ అని తల్లిదండ్రులను మభ్యపెడుతున్నాయి. నిబంధనల ప్రకారం ఈ విద్యా సంవత్సరం ముగిశాక, వచ్చే విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు చేసుకోవాల్సి ఉంటుంది. నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా కొనసాగుతున్నా విద్యాశాఖాధికారులు నిద్రమత్తులో జోగుతుండడం విమర్శలకు తావిస్తోంది.

ఇష్టారాజ్యమే..

సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూళ్లలో ప్రవేశాలకు తీవ్ర పోటీ నెలకొంది. ఎల్‌కేజీ, యూకేజీ సీట్లకు అధిక డిమాండ్ ఉండగా.. ఆ తర్వాత తరగతుల్లో సీట్ల ఖాళీలను బట్టి దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఒక్కో దరఖాస్తుకు రూ.1000 నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో అడ్మిషన్ల ప్రక్రియ ఇష్టారాజ్యంగా మారింది. నిబంధనలు పాటించని యాజమాన్యాలపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వారి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. నర్సరీ నుంచి పదో తరగతి వరకు ముందస్తు అడ్మిషన్లకు తెరలేపి అందిన కాడికి దోచుకుంటున్నాయి. నర్సరీకే రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకూ ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నారు. స్కూల్ యూనిఫాం, పుస్తకాలు ముడిపెట్టి ముందుగానే అడ్మిషన్ ఫీజు చెల్లించాలని షరతు విధిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ విద్యా సంస్థ కూడా డొనేషన్లు వసూలు చేయకూడదు. ఈ నిబంధనను పలు యాజమాన్యాలు ఉల్లంఘిస్తున్నాయి.

ప్రతి టీచర్‌కూ అడ్మిషన్ల టార్గెట్

కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో అడ్మిషన్లకు యాజమాన్యాలు టీచర్లకు టార్గెట్లు పెడుతున్నాయి. ఒక్కొక్కరు 10 అడ్మిషన్లు చేయించాలని ఒత్తిడి తెస్తున్నాయి. టార్గెట్ పూర్తి చేయకుంటే ఉద్యోగానికి ఎసరు పెడుతున్నాయని ప్రైవేట్/ కార్పొరేట్ టీచర్లు వాపోతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్న పాఠశాలలపై మాకు నేరుగా ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం. వచ్చే విద్యా సంవత్సరానికి నిబంధనల ప్రకారం అనుమతి వచ్చిన తరువాతే అడ్మిషన్లు నిర్వహించుకోవాలి. అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవు.

–ఎస్.కృష్ణయ్య, ఇన్‌చార్జ్ డీఈఓ, అనంతపురం

అప్పుడే సుర్రుమంటోంది

- ఉమ్మడి జిల్లాలో పెరిగిన ఉష్ణోగ్రతలు



అనంతపురం అగ్రికల్చర్: ఈసారి వేసవి ముందే మొదలైంది. సాధారణంగా ఫిబ్రవరి నెలాఖరు వరకు చలి వాతావరణం కొనసాగుతుంది. మార్చి నుంచి ఎండలు మొదలై మే నెలాఖరు వరకు ప్రతాపం చూపిస్తాయి. అయితే ఈసారి ఫిబ్రవరి తొలి వారం నుంచే ఉష్ణోగ్రతలు పెరగడం మొదలైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు నాలుగు డిగ్రీలు పెరిగాయి. ఇంతకాలం పగటి ఉష్ణోగ్రతలు 32 డిగ్రీలకు మించలేదు. సోమవారం పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 32 నుంచి 36 డిగ్రీల మధ్య నమోదు కావడం విశేషం. దీంతో పగలంతా ఎండలు సుర్రుమనిపించాయి. రాత్రి, ఉదయం పూట కొన్ని మండలాల్లో 14 నుంచి 16 డిగ్రీలతో కొంత చలి వాతావరణం ఉండగా.. మరి కొన్ని మండలాల్లో 20 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఆరంభంలోనే వేసవి ప్రతాపం చూపించడంతో రానురాను ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఏంటని జనం ఆందోళన చెందుతున్నారు.

చీఫ్ ఎగ్జిక్యూటివ్ సమీర్ శర్మ పర్యటన వాయిదా

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రికి చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా వ్యవహరిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సమీర్‌శర్మ జిల్లా పర్యటన వాయిదా పడింది. మొదట ప్రకటించిన విధంగా మంగళవారం కాకుండా ఈ నెల 14, 15 తేదీల్లో పర్యటన ఉంటుందని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. ఆయన పర్యటనకు సంబంధించి షెడ్యూల్ రావాల్సి ఉందని పేర్కొన్నాయి.

ప్రతి అర్జీకీ ప్రాధాన్యత

- నాణ్యమైన పరిష్కారం చూపాలి : కలెక్టర్

అనంతపురం అర్బన్: 'స్పందన'లో వచ్చే ప్రతి అర్జీకీ ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. మొక్కుబడిగా కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్ఓ గాయత్రిదేవి, ఆర్డీఓ మధుసూదన్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులుతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వివిధ సమస్యలపై 273 అర్జీలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో అర్జీలు పరిష్కరించే క్రమంలో అధికారులు తప్పనిసరిగా అర్జీదారులతో మాట్లాడాలన్నారు. అర్జీల పరిష్కారం విషయంలో కచ్చితత్వం పాటించాలని ఆదేశించారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టక్ నాగలక్ష్మి

అర్జీల్లో కొన్ని..

- తన తండ్రి కుమ్మర అశ్వత్థకు సర్వే నంబరు 629లో 2.75 ఎకరాలకు 1985 డిసెంబరు 8న ప్రభుత్వం డీ పట్టా (16/1395ఎఫ్) ఇచ్చిందని, అయితే ఇటీవల ఆన్‌లైన్‌లో వేరొకరి పేరుపైకి ఈ భూమిని మార్చారని పెద్దపపూరు మండలం ముచ్చుకోట గ్రామానికి చెందిన సోమశేఖర్ ఫిర్యాదు చేశాడు. తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరాడు.
- కూతలేరుపై వంతెన నిర్మించాలని శింగనమల మండలం అలకంరాయునిపేటకు చెందిన ఎస్.సతీష్‌రెడ్డి 'స్పందన'లో అర్జీ సమర్పించాడు. తమ గ్రామం నుంచి రాచేపల్లి పొలాలకు వెళ్లేందుకు కూతలేరు ఏరు దాటి వెళ్లాల్సి ఉందన్నారు. ఏరు దాటేందుకు పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వర్షాకాలంలో సమస్య మరింత జటిలంగా ఉంటోందన్నారు.
- తన భర్త వెంకటేశ్ నాయక్ 2000 సంవత్సరంలో అనారోగ్యంతో మరణించాడని, అయితే మరణ ధ్రువీకరణ పత్రం లేదని తనకు వితంతు పింఛన్ మంజూరు చేయడం లేదని పామిడి మండలం రామగిరి ఎగువ తండాకు చెందిన సోనమ్మ ఫిర్యాదు చేసింది. భర్త మరణ ధ్రువీకరణ పత్రం ఇప్పించి తనకు పింఛను మంజూరు చేయించి ఆదుకోవాలని కోరింది.

ముఖ ఆధారిత హాజరు అమలు కావాలి

అన్ని శాఖల్లోనూ ముఖ ఆధారిత హాజరు 100 శాతం అమలు కావాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ముఖ ఆధారిత హాజరు అంశంపై కలెక్టర్ సోమవారం రెవెన్యూ భవన్‌లో అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ శాఖల్లో ముఖ ఆధారిత హాజరు విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిందన్నారు. అయితే జిల్లాలో జేఎన్‌టీయూ, కళాశాల విద్య, గృహ నిర్మాణ సంస్థ, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మునిసిపల్, అటవీ, తదితర చాలా శాఖలు ఈ విధానంలో ఇంకా నమోదు కాలేదన్నారు. ఆయా శాఖల ఉద్యోగులందరూ వెంటనే యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించారు.

ఇళ్ల నిర్మాణం పూర్తవ్వాలి

'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమం కింద జిల్లాలో ఉగాది నాటికి 20 వేల ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. వివిధ అంశాలపై కలెక్టరేట్ నుంచి జేసీ కేతన్‌గార్గ్‌తో కలిసి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉగాదికి నిర్దేశిత ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో ముఖ్యమంత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ సమీర్ శర్మ పర్యటనను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. సమ్మిళిత అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడంలో జిల్లా యంత్రాగం చేపడుతున్న చర్యలను వివరించాలని చెప్పారు. జిల్లాలో నాడు–నేడు కింద చేపట్టిన భవనాలు, సచివాలయ భవనాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు, ఆర్‌బీకేల నిర్మాణం వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, జడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ భాగ్యరాజ్, ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, స్పందన ఇన్‌చార్జ్ వాణిశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న ఖరము

- క్రమేణా తగ్గిపోతున్న సంఖ్య
- నాడు.. 15వేలు.. నేడు వెయ్యిలోపే
- గాడిదల సంతతి పెంపునకు ప్రభుత్వాల యాక్షన్ ప్లాన్



అనంతపురం అగ్రికల్చర్: సంఘజీవి, కష్టజీవి అయిన గాడిద (ఖరము) క్రమేణా కనుమరుగవుతోంది. శాస్త్ర, సాంకేతిక రంగాలతో పాటు మానవుని జీవన శైలిలో మార్పులు వచ్చాక గాడిదల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఇదే పరిస్థితి మరికొన్ని సంవత్సరాలు కొనసాగితే భూమి మీద గాడిద జాతి అంతరించిపోయే ప్రమాదం ఉంది. దీంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి... వీటి సంతతిని పెంచాలని వార్షిక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

- గాడిద జీవితకాలం 50 సంవత్సరాలు. గ్రామీణ ప్రాంతాల్లో బరువు మోయడానికి వినియోగిస్తారు. చాకలివారు తమ వృత్తి పనిలో వీటినే ఎక్కువగా వాడేవారు. కొండలు, గుట్టలు లాంటి ప్రాంతాల్లో నివసించే వారు రవాణాకు, మరి కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ పనుల్లో కూడా వినియోగించేవారు. లగేజీ రవాణాకు ఆటోలు, తోపుడు బండ్లు, ద్విచక్రవాహనాలు అందుబాటులోకి రావడంతో గాడిదల వినియోగం తగ్గిపోయింది. 30 ఏళ్ల కిందట వరకు గాడిదల సంఖ్య గణనీయంగా ఉండేది. పల్లెల్లో చూస్తే ఎక్కడ చూసినా కనిపించేవి. గాడిద పాలను పిల్లలకు రోగనిరోధక శక్తిగానూ, కొన్ని ఆయుర్వేద మందుల్లోను వాడతారు. అక్కడక్కడా ఉన్న గాడిదల నుంచి కొందరు పాలను సేకరించి అమ్ముకుంటున్నారు. ఇప్పుడు వాటి పాలకు గిరాకీ ఉన్నందున గాడిద కూడా కొందరికి జీవనాధారంగా మారింది.


వెయ్యిలోపే గాడిదలు

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 2007 లెక్కల ప్రకారం 15 వేలకు పైగా గాడిదలు ఉండేవి. 2012లో ఆ సంఖ్య 6,800కు చేరగా, 2018లో 3,200కు పడిపోయింది. తాజాగా గాడిదల సంఖ్య వెయ్యికి లోపే ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో రొళ్ల, శెట్టూరు, విడపనకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు, యాడికి, పెద్దవడుగూరు, గుంతకల్లు, గుత్తి, ధర్మవరం, కూడేరు, కుందుర్పి, అమరాపురం, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో గాడిదలు సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు.


గాడిదల పెంపకంపై 23న సదస్సు


అంతరించిపోతున్న గాడిదల సంతతిని పెంచాలనే ఆలోచనతో ఈ నెల 23న అనంతపురంలో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'బ్రూక్ హాస్పిటల్' ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం, పశుసంవర్ధక శాఖ సహకారంతో 'డిక్లైనింగ్ డాంకీ పాపులేషన్ అండ్ స్టెప్స్ ఫర్ మిటిగేషన్ ఇన్ ది స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై సదస్సు ఏర్పాటు చేశారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం, బ్రూక్ హాస్పిటల్ ప్రతినిధులతో పాటు పశు సంవర్ధక శాఖ రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు, నోడల్ ఆఫీసర్లు, అనిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్స్ ప్రతినిధులు, గుంటూరుకు చెందిన గాడిద పెంపకందారులు కొందరు హాజరు కానున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు.

రాజకీయాల్లో భీమిరెడ్డిది అరుదైన ముద్ర



యల్లారెడ్డిగారి భీమిరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుమ్మనూరు జయరాం





పార్కును ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు

- ఆయన బాటలోనే తనయులు
- భీమిరెడ్డి విగ్రహావిష్కరణలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

గుంతకల్లు: ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే యల్లారెడ్డిగారి భీమిరెడ్డి రాజకీయాల్లో అరుదైన ముద్ర వేసుకున్నారని రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొనియాడారు. తండ్రి బాటలోనే ఆయన తనయులూ నడుస్తున్నారన్నారు. కుమారులు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వై.సీతారామిరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు వై.వెంకటరామిరెడ్డి (గుంతకల్లు), వై.సాయిప్రసాద్‌రెడ్డి (ఆదోని), వై.బాలనాగిరెడ్డి (మంత్రా లయం) ఆధ్వర్యంలో సోమవారం గుంతకల్లులో యల్లారెడ్డిగారి భీమిరెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ జరిగింది. ముఖ్య అతిథులుగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, మంత్రి గుమ్మనూరు జయరాం, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రా రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు అనంతవెంకటరామిరెడ్డి (అనంతపురం), తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (రాప్తాడు), డి.శ్రీధర్‌రెడ్డి (పుట్టపర్తి) హాజరయ్యారు. భీమిరెడ్డి పార్క్‌ను బుగ్గన ప్రారంభించగా, మరో ముఖ్య అతిథి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భీమిరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 1983లో భీమిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నపుడు హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తాను అప్పుడప్పుడు కలిసేవాడినన్నారు. ఎంతో హుందాగా, ఆప్యాయంగా పలకరిస్తూ అందరిలో కలిసిపోయేవాడని గుర్తు చేసుకున్నారు. అంతటి వ్యక్తిత్వం గల భీమిరెడ్డి విగ్రహావిష్కరణలో తాను భాగస్వామి కావడం సంతోషంగా ఉందన్నారు. దేశంలోనే ఏ కుటుంబానికీ దక్కని అరుదైన ఘనత ఈ కుటుంబానికి దక్కిందన్నారు. భీమిరెడ్డి ఐదుగురు సంతానంలో ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒకరు ఎమ్మెల్సీ, పెద్దకోడలు ఎంపీపీ కావడం గర్వించదగ్గ విషయమన్నారు. భీమిరెడ్డి కుటుంబంపై సీఎం జగన్‌కు ఆదరాభిమానాలు ఉన్నాయన్నారు. ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కోవిడ్ పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను ఆపకుండా అమలు చేశారన్నారు. టీడీపీ హయాంలో ఆ పార్టీ సానుభూతిపరులు, వారి సిఫార్సులు ఉన్న వారికి మాత్రమే సంక్షేమ పథకాలు మంజూరయ్యేవన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు వర్తిస్తున్నాయన్నారు. జనరంజక పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీని వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాల్లోనూ గెలిపించాలని పిలుపునిచ్చారు.

ప్రజా సేవలో భీమిరెడ్డి కుటుంబం

మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ భీమిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజలతో మమేకమై ఆదరాభిమానాలను చూరగొన్నారన్నారు. భీమిరెడ్డి మార్గంలోనే కుమారులు సైతం ప్రజాసేవ చేస్తుండటం హర్షించదగ్గ విషయమన్నారు. తనను కూడా వారి కుటుంబ సభ్యుల్లో ఒకరిగా చేర్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. 2014 ఎన్నికల్లో బాలనాగిరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డితోపాటు తాను ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. దీంతో ముఖ్యమంత్రి జగన్ మా ముగ్గురినీ కర్నూలు బ్రదర్స్ అని పిలిచేవారని గుర్తు చేశారు. నాలాంటి బీసీ నాయకుడు ఎదగడానికి వైఎస్ జగన్‌నాయకత్వం ఎంతగానో దోహదపడిందని స్పష్టం చేశారు. ముఖ్య అతిథులకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సన్మానించి, నెట్టికంటి ఆంజనేయస్వామి చిత్రపటాలు అందజేశారు. కార్యక్రమంలో శాసనమండలి విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జిల్లా సీనియర్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, ఉపేంద్రరెడ్డి, గోపాల్‌రెడ్డి, కర్నూలు శివసాయిబాబా స్వామీజీ, కర్ణాటక మాజీ మంత్రి రేవన్, వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ రామాంజనేయులు, మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని (గుంతకల్లు), వన్నూర్‌బీ (గుత్తి), వైస్ చైర్మన్లు నైరుతిరెడ్డి, మైమున్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వలంటీర్ ఆత్మహత్య


నవీన్ (ఫైల్)

బ్రహ్మసముద్రం: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వలంటీర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బ్రహ్మసముద్రంగా గ్రామానికి చెందిన బి.పి.నవీన్ (34) గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. ఐదేళ్ల క్రితం కర్నూలు జిల్లా కోడుమూరుకు చెందిన అక్షితతో వివాహమైంది. పెళ్లైన కొన్ని రోజులకే తల్లిదండ్రుల నుంచి విడిపోయి వేరు కాపురం పెట్టారు. ఈ క్రమంలో కుటుంబంలో తరచూ గొడవలు చోటు చేసుకుంటుండడంతో ఇటీవల భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన నవీన్ ఆదివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం 7 గంటలైనా తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్కల వారు వెళ్లి చూడగా అసలు విషయం వెలుగు చూసింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

వన్‌మ్యాన్ కమిషన్‌ను కలిసిన ఎంపీ రంగయ్య


శామ్యూల్ ఆనంద్‌తో మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం సప్తగిరి సర్కిల్: వన్‌మ్యాన్ కమిషన్ శామ్యూల్ ఆనంద్‌ను అనంతపురం పార్లమెంటు సభ్యుడు తలారి రంగయ్య సోమవారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బోయ, వాల్మీకులు, బొంతు కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు వన్‌మ్యాన్ కమిషన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయనను ఢిల్లీలోని పార్లమెంటు లైబ్రరీలో ఎంపీ కలసి మాట్లాడారు.

అసైన్డ్ భూ పంపిణీ


పట్టాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: నియోజకవర్గంలోని దాదాపు 81 మంది లబ్ధిదారులకు మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుమ్మనూరు జయరాం చేతుల మీదుగా అసైన్ భూమి సాగు హక్కు పట్టాలు పంపిణీ చేశారు. గుంతకల్లులో 105 మంది లబ్ధిదారులకు 147.01 ఎకరాలు, గుత్తిలో 215 మంది లబ్ధిదారులకు 254.31 ఎకరాలు, పామిడిలోని 119 మంది లబ్ధిదారులకు 134.75 ఎకరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తుది పోరుకు 'ఎస్‌పీఎల్'


బాలాజీ కళాశాల జట్టు క్రీడాకారుడిని బౌల్డ్ చేసిన ఆర్ట్స్ కళాశాల బౌలర్


ఫైనల్‌కు చేరుకున్న అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల జట్టు


ఫైనల్‌కు చేరుకున్న ఆర్ట్స్ కళాశాల జట్టు

- నేడు తలపడనున్న ఆర్ట్స్ కళాశాల, అనంతలక్ష్మి జట్లు

అనంతపురం సప్తగిరి సర్కిల్: 'సాక్షి' మీడియా యాజమాన్యం ఆధ్వర్యంలో అనంత క్రీడా గ్రామం వేదికగా మూడు ప్రధాన మైదానాల్లో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు మూడో రోజు సోమవారమూ ఉత్కంఠగా సాగాయి. మంగళవారం జరిగే ఫైనల్స్‌లో అనంతపురం ఆర్ట్స్ కళాశాల, అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల జట్లు తలపడనున్నాయి.

మ్యాచ్‌ల వివరాలు..

విన్సెంట్ క్రీడా మైదానంలో నిర్వహించిన చివరి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఎస్ఎంజీఎల్ (కదిరి), అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల (అనంతపురం) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి ఎస్ఎంజీఎల్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన అనంతలక్ష్మి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసింది. జట్టులో రాజశేఖర్ 13 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 33 పరుగులు, షాకీర్ 24 బంతుల్లో 2 ఫోర్లతో 18 పరుగులు సాధించారు. ఎస్ఎంజీఎల్ బౌలర్లలో వేణు 3, వెంకటేష్‌నాయక్, రాజశేఖర్ చెరో 2 వికెట్లను సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎస్ఎంజీఎల్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 49 పరుగులు చేసింది. జట్టులో రాజశేఖర్ 18 బంతుల్లో 4 ఫోర్లతో 20 పరుగులు సాధించాడు. అనంతలక్ష్మి బౌలర్లలో శ్యాం 3, రాజేష్ 2 వికెట్లు సాధించారు. 29 పరుగులతో అనంతలక్ష్మి జట్టు విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరుకుంది.

- తొలి సెమీఫైనల్ మ్యాచ్‌లో అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల, శ్రీబాలాజి కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి ఆర్ట్స్ కళాశాల జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీబాలాజి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 66 పరుగులు సాధించింది. ఆర్ట్స్ కళాశాల బౌలర్లలో వినయ్ 3, భార్గవ్ 2 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆర్ట్స్ కళాశాల జట్టు 7.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో శ్రీకాంత్ 19 బంతుల్లో 5 ఫోర్లతో 28 పరుగులు సాధించాడు. 7 వికెట్ల తేడాతో విజయం సాధించి ఆర్ట్స్ కళాశాల జట్టు ఫైనల్‌కు చేరుకుంది.
- రెండో సెమీస్ మ్యాచ్‌లో అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల, ఎస్ఎస్‌జీఎస్ (గుంతకల్లు) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి అనంతలక్ష్మి జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా తొలుత బ్యాటింగ్ చేసిన గుంతకల్లు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేసింది. జట్టులో తౌసిఫ్ 28 బంతుల్లో 5 ఫోర్లతో 42, భువన్ 22 బంతుల్లో 2 ఫోర్లతో 26 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతలక్ష్మి జట్టు 9.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో రాజశేఖర్ 17 బంతుల్లో 5 ఫోర్లతో 36 పరుగులు, షాకీర్ 10 బంతుల్లో 3 సిక్సర్లతో 23 పరుగులు సాధించారు. 7 వికెట్ల తేడాతో విజయం సాధించి అనంతలక్ష్మి జట్టు ఫైనల్‌కు చేరుకుంది.

నేడు ఫైనల్స్..

జూనియర్ విభాగంలో సాయి విజ్ఞాన్ జూనియర్ కళాశాల (అనంతపురం), ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఆత్మకూరు) జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్‌ను అనంత క్రీడా గ్రామంలోని విన్సెంట్ క్రీడా మైదానంలో మంగళవారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నారు. అలాగే సీనియర్ విభాగం ఫైనల్ మ్యాచ్‌ను మధ్యాహ్నం 1 గంటకు ఆర్ట్స్ కళాశాల, అనంతలక్ష్మి జట్ల మధ్య నిర్వహించనున్నారు.

వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ నేతల దాడి

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామంలో వైఎస్సార్‌సీపీ వర్గీయులపై తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం దాడి చేసి గాయపరిచారు. బాధితులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన రంగనాథ, దివాకర్, గంగాధర్‌కు టీడీపీకి చెందిన అశోక్, ప్రతాప్, గోవిందు, సురేష్, హరి, రాముడు, మురళి, నాగేంద్ర, శ్రీకాంత్, కల్యాణ్ వర్గంతో పాత గొడవలున్నాయి. ఈ ఏడాది జనవరి నెలలో టీడీపీకి చెందిన కొందరు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. రంగనాథ, దివాకర్, గంగాధర్ ప్రోద్బలంతోనే తమ పార్టీకి చెందిన వారు వైఎస్సార్‌సీపీలో చేరారని అప్పటి నుంచి గొడవపడుతుండేవారు. వైఎస్సార్‌సీపీ వర్గీయులు సోమవారం గుంతకల్లులో భీమిరెడ్డి విగ్రహావిష్కరణకు వెళ్లారు. ఇళ్ల వద్ద ఎవరూ లేని విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు అశోక్, ప్రతాప్‌తో పాటు మరో 10 మంది వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లపై దాడి చేశారు. ఇళ్లలో ఉన్న మహిళలతో గొడవకు దిగి విచక్షణారహితంగా చితకబాదారు. దాడిలో రంగనాథ, దివాకర్, గంగాధర్, మంజుల, జయమ్మ, అన్నపూర్ణ, భాగ్యమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు భాగ్యమ్మను మెరుగైన చికిత్సకు అనంతపురంలోని వైద్యశాలకు తరలించారు. గ్రామంలో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

రాయలసీమ స్థాయి క్రికెట్ విజేతగా 'ఆరోగ్యవరం'


విజేతలకు ట్రోఫీని అందిస్తున్న రాయలసీమ దయాసిస్ బిషప్ ఐజాక్ వరప్రసాద్

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాయలసీమ దయాసిస్ క్రిష్టియన్ యూత్ క్రికెట్ టోర్నీ విజేతగా ఆరోగ్యవరం జట్టు నిలిచింది. స్థానిక అనంత క్రీడా గ్రామంలోని బీ క్రీడా మైదానంలో నిర్వహించిన రాయలసీమ స్థాయి క్రిష్టియన్ యూత్ క్రికెట్ టోర్నీ పోటీల్లో ఫైనల్‌లో ఆరోగ్యవరం, ఆళ్లగడ్డ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి ఆరోగ్యవరం జట్టు బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 151 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆళ్లగడ్డ జట్టు 19.4 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌటైంది. దీంతో ఆరోగ్యవరం జట్టు 11 పరుగులతో విజయం సాధించింది. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని స్థానిక అరవింద నగర్‌లోని సీఎస్ఐ హోలీ ట్రినిటి చర్చిలో సోమవారం రాత్రి నిర్వహించారు. యువత అన్ని రంగాల్లోను రాణించాలని రాయలసీమ దయాసిస్ బిషప్ ఐజాక్ వరప్రసాద్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బెనహర్ బాబు, యూత్ డైరెక్టర్ మ్యాషి, ప్రశాంత్, సుశాంత్, స్టీవ్, ప్రమోద్, డ్యానీ, శేఖర్ పాల్గొన్నారు.

పోలీసు 'స్పందన'కు 100 వినతులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై వంద వినతులు అందాయి. ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప స్వయంగా బాధితుల నుంచి వినతులు స్వీకరించి, మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని పరిష్కారం నిమిత్తం సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం

ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఓ మహిళ మోసం చేసిన తీరును స్పందన కార్యక్రమంలో ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప దృష్టికి ఓ బాధిత యువతి తీసుకువచ్చింది. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'నా పేరు కె.పి.భారతి. కర్నూలులో వివాహం చేసుకున్నాను. ప్రస్తుతం అక్కడే కాపురం ఉంటున్నాం. అనంతపురం శాంతినగరు సమీపంలో నివాసం ఉంటున్న కె.గాయత్రి, ఆమె కుమార్తె సామ్రాజ్యం, కొడుకు కె.వెంకటరెడ్డి మా కుటుంబానికి పరిచయస్తులు. కీలక నేతలతో తమకు పరిచయాలు ఉన్నాయంటూ నమ్మబలికి ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పారు. విజయవాడ కేంద్రంగా ఓ కంపెనీ పెట్టామని, సాఫ్ట్‌వేర్, ఐసీడీఎస్‌లో ఉద్యోగాలు కల్పిస్తుంటామని పేర్కొన్నారు. వారి మాటలు నమ్మి రూ.1.50 లక్షలు 2022, సెప్టెంబర్‌లో ఫోన్‌పే ద్వారా గాయత్రి కుమార్తె సామ్రాజ్యం ఖాతాకు బదిలీ చేశాను. ఇప్పటి వరకూ పట్టించుకోలేదు. గాయత్రి చేసిన మోసాన్ని ఎవరికి చెప్పుకోలేక తీవ్ర మానసిక వేదనను అనుభవిస్తున్నాను. నాలాంటి వారు చాలా మంది వారి చేతిలో మోసపోయారు. వీరిపై చర్యలు తీసుకుని, నా డబ్బు నాకు ఇప్పించాలి' అని వేడుకున్నారు.

పెద్దారెడ్డి యాత్రకు ప్రముఖుల సంఘీభావం


ప్రజా సంక్షేమ పాదయాత్రలో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నాయకులు.

పెద్దవడుగూరు: తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ప్రజాసంక్షేమ పాదయాత్రకు ప్రముఖులు సంఘీభావం తెలిపారు. గురువారం కాశేపల్లి నుంచి బయలుదేరిన పాదయాత్ర 9వ రోజు సోమవారం కొనసాగింది. విషయం తెలుసుకున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, కాపు రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, అహుడా చైర్మన్ మహాలక్ష్మీ శ్రీనివాస్, ఏపీ రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ చామలూరు హరిత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య, ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ పామిడి వీరాంజినేయులు తదితరులు పాల్గొన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఆశయాలను నెరవేర్చే విధంగా ఎమ్మెల్యేలు అందరూ కష్టడాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి చేస్తున్న పాదయాత్రపై హర్షం వ్యక్తం చేశారు. తాడిపత్రి నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జగన్ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు కట్టుబడి తానీషా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జబీన్‌బాషా, రాష్ట్ర కార్యదర్శి ఇక్బాల్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలి


ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి వినయ్ మోహన్

అనంతపురం: విద్యాహక్కు చట్టం ప్రకారం బడి ఈడు గల పిల్లలందరూ పాఠశాలలోనే ఉండాలి. బడి బయట ఏ ఒక్క పిల్లాడు ఉండకూడదు. బడి ఈడును బట్టి నేరుగా ఆ తరగతుల్లో చేర్పించాల్సి ఉంటుంది. విద్యార్థి ఎక్కడైనా ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకోవచ్చు. బాలబాలికలు ప్రతి ఒక్కరూ చదువుకోవాలి. ఈ నేపథ్యంలో యూడైస్ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్)లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు యూడైస్ ప్లస్‌లో నమోదు చేస్తున్నారు. అయితే తాజాగా ప్రీప్రైమరీ-1, ప్రీప్రైమరీ-2 చదివే విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ప్రైవేట్ పాఠశాల విద్యార్థుల వివరాలు సేకరించి నమోదు చేయాలని నిర్దేశించింది. ప్రతి విద్యార్థి వివరాలు నమోదు చేస్తే ...ఎక్కడ చదువుతున్నాడు అనే అంశంతో పాటు అర్ధంతరంగా చదువు ఆపేస్తే విద్యార్థి వివరాలు తెలుసుకుని పాఠశాలలో చేర్పించడానికి వీలు కలుగుతుంది.

జిల్లాలో 23 వేల మంది విద్యార్థులు:

అనంతపురం జిల్లాలో మొత్తం 23,138 మంది పీపీ-1, పీపీ-2 విద్యార్థులు ఉన్నారు. ప్రీప్రైమరీ-1లో 12,010 మంది, ప్రీప్రైమరీ-2లో 11,128 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలో మొత్తం 461 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఒకదఫా యూడైస్ ప్లస్‌లో నమోదు చేస్తే పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారినా యూడైస్ ప్లస్‌లో విద్యార్థి వివరాలు భద్రంగా ఉంటాయి. ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రైవేట్ పాఠశాలకు మారినా యూడైస్‌ప్లస్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉండడంతో విద్యార్థి చదువుకు ఆటంకం కలగకుండా పర్యవేక్షణ చేస్తారు. అర్ధంతంగా విద్యను ఆపేసినా యూడైస్ ప్లస్‌లో విద్యార్థి వివరాలు తెలుసుకుని తిరిగి పాఠశాలలో విద్యను కొనసాగించడానికి వీలు కలుగుతుంది.

యూడైస్ ప్రామాణికం:

యూడైస్‌ప్లస్‌లో వివరాలు నమోదు చేస్తే చైల్డ్‌ఇన్ఫోలోనూ వివరాలు నమోదు అవుతాయి. చైల్డ్‌ఇన్ఫోలో విద్యార్థి అకడమిక్ ప్రగతి, హాజరుశాతం, తదితర అంశాలను భద్రపరచుకోవచ్చు. ఈ క్రమంలో యూడైస్ ప్రామాణికం అయింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించిన యూడైస్ వివరాలు నమోదుకు రాష్ట్ర విద్యాశాఖ వినయ్‌మోహన్ అనే ప్రత్యేకాధికారిని నియామకం చేసింది. ఆయన అనంతపురం జిల్లాలో సోమవారం పర్యటించారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలకు యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాల్సిన అంశాలపై వివరించారు. ప్రతి విద్యార్థి డేటాను భద్రపరచడంతో పాటు, ప్రతి విద్యార్థికి సంపూర్ణ విద్యను అందించేందుకు ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. నిర్దేశించిన గడువులోపు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు పీపీ-1, పీపీ-2 విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని కోరారు.

ఉర్దూ పాఠశాలలో చోరీ

రాయదుర్గం టౌన్: జిల్లా ప్రాథమిక విద్యా కార్యక్రమం (డీపీఈపీ) కింద స్థానిక మొలకాల్మూరు రోడ్డులోని హిమ్మత్ నగర్‌లో ఏర్పాటు చేసిన ఉర్దూ మున్సిపల్ పాఠశాలలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు వంట గది తాళాలు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. వంట గ్యాస్ సిలిండర్‌తో పాటు స్టవ్, నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రి అపహరించుకెళ్లారు. ఈ విషయాన్ని సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు నయాబ్ అన్సార్ గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు దిగబోతూ వృద్ధుడి మృతి

రాయదుర్గంటౌన్: కదులుతున్న రైలు దిగబోయి ఓ వృద్ధుడు మృత్యువాతపడ్డాడు. వివరాలు... రాయదుర్గం పట్టణానికి చెందిన జోగి బైరప్ప (71), పద్మ దంపతులు. వాల్మీకి నగర్‌లో నివాసముంటున్న వీరు కర్ణాటకలోని హూళిగిలో వెలసిన ఉలిగమ్మ ఆలయ సందర్శనకు ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు రాయదుర్గం నుంచి రైలులో బయలుదేరారు. కర్ణాటకలోని మునీరాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే నెమ్మదిగా కదులుతున్న రైలు నుంచి దిగే ప్రయత్నంలో బైరప్ప ప్లాట్‌ఫాంపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక రైల్వే పోలీసులు క్షతగాత్రుడిని వెంటనే హోస్పేటలోని ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై మునీరాబాద్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

8 నుంచి సైన్స్ ఎగ్జిబిషన్

అనంతపురం రూరల్: పీవీకేకే ఐటీ డిప్లొమా కళాశాలలో ఈ నెల 8 నుంచి మూడు రోజుల పాటు జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ వైభవ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 9, 10వ తరగతి విద్యార్థులతో పాటు డిప్లొమా విద్యార్థుల్లో ఉండే సృజనాత్మక ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

36 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ వీరరాఘవరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో 36 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక కళ్యాణదుర్గం కూడలిలో ఏపీ39టీఎస్8658 నంబరు గల అశోక్ లైలాండ్ వాహనంలో బియ్యం తరలిస్తుండగా అధికారులు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. బియ్యం తరలిస్తున్న ముత్యాలు, హరికృష్ణ, కుటాల నారాయణస్వామిని అరెస్ట్ చేశారు.

జీ-20 దేశాల ప్రతినిధులకు పటిష్ట భద్రత

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: కర్ణాటకలోని పావగడ సోలార్ పార్క్ సందర్శన నిమిత్తం జీ-20 దేశాల ప్రతినిధుల బృందం మంగళవారం పర్యటించనుంది. ఈ నేపథ్యంలో రహదారులపై భద్రత ఏర్పాట్లను ఎస్పీ ఫక్కీరప్ప సమీక్షించారు. శ్రీసత్యసాయి జిల్లా కొడికొండ నుంచి చిలమత్తూరు, మడకశిర, పావగడ సోలార్ పార్కు వరకూ ఉన్న రహదారిని ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. పటిష్ట భద్రత కల్పించేందుకు అవసరమైన బందోబస్తు చర్యలపై ఆయా పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

మరో 63 ఎకరాల భూ సేకరణ

అనంతపురం రూరల్: నవరత్నాలు పేదలందరికి ఇళ్లు పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అనువుగా మరో 63 ఎకరాల భూమిని సేకరించినట్లు అనంతపురం ఆర్డీఓ మధుసూధన్ సోమవారం తెలిపారు. అనంతపురం మండలం రాచానపల్లిలో 20.50 ఎకరాలు, కురుగుంటలో 15 ఎకరాలు, బుక్కరాయసముద్రం మండలం సిద్దరాంపురంలో 28 ఎకరాల భూమిని సేకరించినట్లు వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు రాచానపల్లి రైతులకు ఎకరానికి రూ. 24.50 లక్షలు, కురుగుంట రైతులకు రూ.28.70 లక్షలు, సిద్దరాంపురం రైతులకు రూ.21 లక్షలు పరిహారం చెల్లిస్తామన్నారు. పరిహారానికి సంబంధించిన నివేదిక కలెక్టర్ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి నివేదిక అందిన వెంటనే రైతులకు పరిహారం చెల్లించి భూమిని స్వాధీనం చేసుకుంటామన్నారు.

మా భూములు స్వచ్ఛందంగానే ఇచ్చాం


వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కళ్యాణదుర్గం: రాయదుర్గం ప్రాంతంలో తమ భూములను సోలార్ కంపెనీ ఏర్పాటుకు స్వచ్ఛందంగానే భూములు ఇచ్చామని ఆ ప్రాంత రైతులు స్పష్టంచేశారు. కణేకల్లు, డీ హీరేహాళ్, బొమ్మనహాళ్, రాయదుర్గం ప్రాంతాలకు చెందిన రైతులు సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం కణేకల్లు మండల అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, రైతులు హరినాథ్‌రెడ్డి, గోవిందరెడ్డి, పాటిల్ గంగిరెడ్డి, జగ్గారెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు విలేకరులతో మాట్లాడారు. కొన్ని రోజుల క్రితం ఓ పత్రికలో సోలార్‌కు భూములిచ్చిన రైతులు భయభ్రాంతులకు గురి చేసేలా తప్పుడు కథనాలు రాశారన్నారు. దుష్ప్రచారం చేయడం మంచిది కాదన్నారు. ఒక్కో ఎకరానికి రూ.30 వేలు చొప్పున లీజు ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. తమను భూములివ్వాలని ఎవ్వరూ బలవంతం చేయలేదన్నారు.

క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

రామగిరి: మండలంలోని పెద్దకొండాపురం పంచాయతీ రెడ్డివారిపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనున్నట్లు స్థానిక నాయకులు వెంకటరెడ్డి, రామ్మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండల నాయకులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

టిడ్కో ఇళ్లను ఇవ్వాలి

అనంతపురం అర్బన్: టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీల్లో ఇళ్లను పూర్తి చేసి మౌలిక సదుపాయలు కల్పించి లబ్ధిదారులకు అందజేయాలని సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, నగర కార్యదర్శి శ్రీరాములు మాట్లాడారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి ప్రస్తుతం ఇస్తున్న రూ.1.80 లక్షలు మొత్తాన్ని రూ.5 లక్షలు పెంచాలన్నారు. ఇంటి నిర్మాణానికి ఇసుక, సిమెంట్ ఉచితంగా ఇవ్వాలన్నారు. అనంతరం వారి ధర్నా వద్దకు వచ్చిన కలెక్టరేట్ బి-సెక్షన్ సూపరింటెండెంట్ తిరుమలరెడ్డికి నాయకులు వినతిపత్రం అందజేశారు.

ఆవాజ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ముస్కిన్



అనంతపురం అర్బన్: ఆవాజ్ రాష్ట్ర కమిటీలో జిల్లా కమిటీ నాయకుడు ముస్కిన్‌కు స్థానం లభించింది. ఆయన రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈనెల 5న గుంటూరులో రాష్ట్ర సమావేశం నిర్వహించినట్లు ముస్కిన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కమిటీలో తనను తీసుకొని సహాయ కార్యదర్శిగా నియమించారన్నారు. ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఆత్మకూరు ఎంపీడీఓగా విజయ్‌ప్రసాద్



బాధ్యతలు స్వీకరిస్తున్న విజయ్‌ప్రసాద్

ఆత్మకూరు: ఆత్మకూరు నూతన ఎంపీడీఓగా విజయ్ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూరులో పని చేస్తున్న ఎంపీడీఓ కొండన్న బదిలీపై వెళ్లారు. డ్వామాలో అడిషనల్ పీడీగా పని చేస్తున్న విజయ్ ప్రసాద్‌ను ఆత్మకూరు ఎంపీడీగా బదిలీ చేశారు.

పంపనూరులో పూజలు



ప్రత్యేక అలంకరణలో మంజునాథుడు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలోని మంజునాథ స్వామికి సోమవారం పూజలు చేశారు. మాఘమాస పూజల్లో భాగంగా స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామికి ప్రత్యేకంగా పూజలు చేసి, మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

నేడు అమ్మవారిశాలలో గజగౌరి పూజలు

అనంతపురం కల్చరల్: నగరంలోని పాతూరు శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో రెండు రోజుల పాటు సామూహిక శ్రీ గజగౌరీ పూజలు, ఉత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు సోమవారం ఆలయంలో జరిగిన సమావేశంలో శ్రీ వాసవీ మహిళా మండలి ప్రధాన కార్యదర్శి పద్మజ వివరాలు అందించారు. మంగళవారం ఉదయం 9 గంటలకు గజగౌరి పూజావ్రతాలు, తీర్థప్రసాద వినియోగం ఉంటుంది. బుధవారం ఉదయం 7.30 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం, అనంతరం నిమజ్జనం జరుగుతాయని భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఈకేవైసీ కోసం గ్రామసభలు



ఆత్మకూరులో ఈ కేవైసీ చేస్తున్న వ్యవసాయ, పోస్టల్ సిబ్బంది

ఆత్మకూరు: స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఈ-కేవైసీ, పీఎం కిసాన్ వర్తించని రైతులకు గ్రామసభలు నిర్వహించారు. బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్ లేకపోయినా, ఆధార్‌కు ఫోన్ నంబర్ లింక్ కాకపోయినా చేస్తున్నట్లు ఏఈఓ సురేష్ తెలిపారు. మండల వ్యాప్తంగా గొరిదిండ్ల 675 మంది, పి.యాలేరులో 470 మంది, ఆత్మకూరులో 221 మంది, సనపలో 200 మంది, మదిగుబ్బలో 169 మంది, తోపుదుర్తిలో 115 మంది, బి.యాలేరులో 99 మంది, తలుపూరులో 15 మంది రైతులు ఈకేవైసీ, పీఎంకిసాన్ వర్తించని రైతులు ఉన్నారని తెలిపారు. మంగళవారం కూడా ఈ కేవైసీ, పీఎం కిసాన్ వర్తించని రైతులకు ఆత్మకూరు రైతు భరోసా కేంద్రంలో గ్రామ సభ ఉంటుందన్నారు.

ఓర్వలేక బురదజల్లే ప్రయత్నం

• మేయర్ వసీం



కోవూర్‌నగర్‌లో స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: నగరాన్ని రాష్ట్రంలో అత్యుత్తమ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం ఇండోర్ స్టడీ టూర్‌ను ఏర్పాటు చేశామని మేయర్ వసీం అన్నారు. అభివృద్ధిని ఓర్వలేక ఏదో ఒక విధంగా పాలకవర్గంపై ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. సోమవారం నగరంలోని కోవూర్‌నగర్‌లో మేయర్ పర్యటించి, స్థానిక ప్రజలతో ఏమైనా సమస్యలున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టడీ టూర్‌పై ప్రతిపక్షాలు చేసిన విమర్శలను ఆయన ఖండించారు. గత టీడీపీ హయాంలో విజయనగరం, సాలూరు, తెనాలి, పార్వతీపురం, తదితర మునిసిపాలిటీల పాలకవర్గాలు కేరళ, కర్ణాటక, ఢిల్లీ ప్రాంతాల్లో పర్యటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. టీడీపీ నేతలు మాత్రం విహారయాత్రకు వెళ్లి వచ్చారని, తామైతే విజ్ఞాన యాత్రకు వెళ్తున్నామన్నారు. ఇండోర్, తదితర ప్రాంతాల్లో పర్యటించి, నగరాభివృద్ధి కోసం అక్కడ వారు చేస్తున్న కార్యక్రమాలను పరిశీలించి, అనంత ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడమే తమ పాలకవర్గం లక్ష్యమన్నారు.

నగర రూపురేఖలు మారుస్తున్నాం :

మూడున్నరేళ్ల కాల వ్యవధిలోనే తమ ప్రభుత్వం నగర రూపురేఖలు మార్చేలా చర్యలు తీసుకున్నట్లు మేయర్ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో నగరంలో రూ.800 కోట్ల అభివృద్ధి జరుగుతోందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వివిధ డివిజన్లలో అపరిష్కృత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు:

నగరంలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలని మేయర్ వసీం సలీం అధికారులను ఆదేశించారు. సోమవారం 38,42 డివిజన్లలో ఆయన పర్యటించారు. 42వ డివిజన్‌లో పారిశుధ్య కార్మికులు తక్కువగా ఉన్నారన్న విషయాన్ని తెలుసుకున్న ఆయన.. కార్మికులను సర్దుబాటు చేయాలని ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డిని ఆదేశించారు. కార్పొరేటర్లు ఇస్హాక్, రహంతుల్లా, అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, నాయకులు ఖాజా, పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన మేయర్

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నగర మేయర్ వసీం మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం మరూరు టోల్‌గేట్ వద్ద మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డికి మేయర్ పుష్పగుచ్ఛం అందించారు.

కర్నూలులో కేఆర్ఎంబీ కార్యాలయం ఏర్పాటు చేయాలి

రాప్తాడు: కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలని ఏపీ అభివృద్ధి వికేంద్రికరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కేవీ రమణ పేర్కొన్నారు. సోమవారం జిల్లాలోని గుంతకల్లు పర్యటనకు విచ్చేస్తున్న అటవీ, ఇంధన, ఐటీ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మండలంలోని మరూరు గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారి టోల్ ప్లాజా దగ్గర వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గోదావరి బోర్డు కేంద్ర స్థానం విషయంపై తెలంగాణ రాష్ట్రం, కృష్ణా నది బోర్డు కేంద్ర స్థానం విషయమై ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నిర్ణయం తీసుకునే హక్కును విభజన చట్టం కల్పించిందన్నారు. కేఆర్ఎంబీ బోర్డు కార్యాలయం ఏర్పాటు విషయమై తీవ్రమైన చర్చ జరుగుతోందన్నారు. ఐదు రాష్ట్రాల మధ్య శ్రీశైలం ప్రాజెక్టు అంత్యంత కీలకమైందన్నారు. అనేక వివాదాలకు కారణమవుతున్న శ్రీశైలం బ్యాక్ వాటర్ తదితర కీలక అంశాల పర్యవేక్షణకు బోర్డ్ కార్యాలయం కర్నూలు కేంద్రంగా ఉండటం సమంజసమన్నారు. లేని పక్షంలో రాయలసీమ ప్రజలు ప్రభుత్వంపై ప్రజలు వ్యతిరేకత ఎక్కువ అవుతుందన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి జనరల్ సెక్రటరీ హనుమన్న, కోశాధికారి గాజుల వెంకటసుబ్బయ్య, జాయింట్ సెక్రటరీ కేపీ కుమార్, ఉపాధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే నాయీ బ్రాహ్మణులు



మాట్లాడుతున్న శ్రీనివాసులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు అండగా ఉంటున్నారని, నాయీబ్రాహ్మణులు ఎప్పటికీ వైఎస్సార్‌సీపీలోనే ఉంటామని రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు అన్నారు. నగరంలోని స్థానిక ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి తరపున టీడీపీ కార్యకర్తలుగా ప్రచారం చేసిన నాయీబ్రాహ్మణులను తిరిగి పార్టీలోకి చేరారని చెప్పుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. భారీగా టీడీపీలో చేరారని చెబుతున్న మల్లికార్జున, లింగమయ్య తదితర నాయీ బ్రాహ్మణులు టీడీపీలో ఉన్నారన్న సంగతి కూడా తెలియడం లేదా? అని ప్రశ్నించారు. గతంలో వారు టీడీపీ తరపున ప్రచారం చేసిన ఫొటోలను ఆయన మీడియాకు చూపారు. ప్రస్తుత ప్రభుత్వంలో పెద్ద ఎత్తున నాయీబ్రాహ్మణులు లబ్ధిపొందారనే అంశాన్ని కూడా మరిచిపోయారన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ వారోత్సవాలు

కనగానపల్లి: మండలంలో మంగళవారం నుంచి మొబైల్ ఆధార్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం మండల వ్యాప్తంగా నాలుగు మొబైల్ ఆధార్ కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, ప్రజల ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయిస్తామన్నారు. మండల కేంద్రం కనగానపల్లిలోని మోడల్ స్కూల్, కేజీబీవీతో పాటు తగరకుంట, మామిళ్లపల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలలో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నెల 7వ నుంచి 10వ తేదీ వరకు ఆధార్ కార్డుల పరిశీలించి, అప్‌డేట్ చేస్తారన్నారు.

నారాయణ కళాశాలను మూసివేయాలి



ఆందోళన చేస్తున్న విద్యార్థి నాయకులు

అనంతపురం: నగరంలోనిని నారాయణ కళాశాల విద్యార్థిని ఆత్మహత్యయత్నానికి ఫీజుల కోసం వేధింపులే కారణమని ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు ఆరోపించారు. నారాయణ కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని, విద్యాసంస్థలను మూసివేయాలని డిమాండ్ చేశారు. నారాయణ కళాశాల వద్ద విద్యార్థి నాయకులు ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ నారాయణ విద్యా సంస్థల యాజమాన్యం అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను వేధిస్తున్నారన్నారు. ఫీజుల వేధింపులకు తట్టుకోలేక మానసికంగా ఒత్తిడికి గురైన విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్నారన్నారు. నారాయణ కళాశాల దోపిడీని అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ఫీజు కట్టలేదని మానసిక వేదనతో విద్యార్థిని బలవన్మరణానికి యత్నించిందన్నారు. జిల్లాలోని అన్ని నారాయణ కళాశాలలను వెంటనే మూసివేయాలన్నారు. నారాయణ కళాశాల అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ పరమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఏపీఎస్ఎఫ్ నాయకులు రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమానికి పెద్దపీట



ఓబుళంపల్లిలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

• రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

చెన్నేకొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఓబుళంపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా అని నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ బ్రోచర్ అందించారు. ఈ సందర్భంగా పలువురు తమకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని అడిగారు. వెంటనే ఇళ్ల పట్టాలను అందించాలని రెవెన్యూ, హౌసింగ్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే చంద్రబాబు తన అనుకూల మీడియా ద్వారా విమర్శలు చేయిస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలే చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంజలీ, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి, సర్పంచు చెన్నారెడ్డి, ఎంపీటీసీ వెంకట రెడ్డి, నాయకులు సానే రాజారెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహా రెడ్డి, కరి క్రిష్టప్ప, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2025 నాటికి క్షయవ్యాధిని తరిమికొడదాం

• రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



పౌష్టికాహారం కిట్టును అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: 2025 నాటికి క్షయవ్యాధి రహిత సమాజంగా మారుద్దామని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాప్తాడు నియోజక వర్గ పరిధిలోని 40 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని ఎమ్మెల్యే తన సొంత డబ్బులతో అందజేశారు. సోమవారం అనంతపురం నగర శివారులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సక్రమంగా మందులు, సరైన పౌష్టికాహారం తీసుకుంటేనే క్షయ నివారణ సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో క్షయవ్యాధి లేకుండా చేసేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. రోగ నిరోధకశక్తి పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేద ప్రజల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. అధునాతన క్షయ పరీక్ష చేయడానికి ట్రూనాట్ పరికరాలను 160 వరకు కొనేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. క్షయవ్యాధి నివారణకు స్పందించిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి జిల్లా క్షయ వ్యాధి నివారణాధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ ధన్యవాదాలు తెలియజేశారు. ఏపీ ఎన్జీఓ సంఘం నగర కార్యదర్శి శ్రీధర్ బాబు, జిల్లా క్షయ వ్యాధి నివారణ కార్యాలయ సిబ్బంది శ్రీనివాసులరెడ్డి, శ్రావణి,మహేష్, నాగమణి, జయవర్ధన్, సూరి, శ్రీనివాస్, రేవతి, నిర్మల, వెంకటేష్, సుమన్ పాల్గొన్నారు.

ఘనంగా అక్కమ్మ జాతర



కొలువైన అక్కమ్మ గారు



జాతరలో పాల్గొన్న భక్తులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లిలో వెలిసిన అక్కమ్మ గారి పరుష (జాతర) సోమవారం ఘనంగా జరిగింది. ఏటా మాఘశుద్ధ పౌర్ణమి, బహుళ పాడ్యమి రోజున అక్కమ్మ గారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని స్థానికులు తెలిపారు. రాచానపల్లి, అక్కంపల్లి, కొడిమి, గొటుకూరు, సిండికేట్‌నగర్, కందుకూరు, సిద్ధరాంపురం గ్రామాల నుంచి గుడికట్టువారు హాజరయ్యారు. అయా గ్రామాలతో పాటు అనంతపురం చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకొని ఆనందంగా గడిపారు. సీఐ విజయభాస్కర్‌గౌడ్, ఎస్ఐలు వెంకటరమణ, ప్రవీణ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. రాచానపల్లి సర్పంచ్ అంజి (బండా) ఆధ్వర్యంలో 1,500 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు వేలాది మంది భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల ధర్నా

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘం ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఓబులు, అంగన్‌వాడీల సంఘం గౌరవాధ్యక్షుడు నాగేంద్ర, అధ్యక్ష, కార్యదర్శులు శకుంతల, రమాదేవి మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఫేషియల్ హాజరు రద్దుచేయాలని, 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టీఏ బిల్లులు మంజూరు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీలకు జాబ్‌క్యాలెండర్ నిర్ణయించాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలన్నారు. సర్వీసులో ఉండి మరణించిన ఉద్యోగి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, బీమా అమలు చేయాలన్నారు. ఇతర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు సావిత్రి, సంఘం కోశాధికారి జమున పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆర్టీసీ బస్టాండ్‌లో త్రీటౌన్ పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా బస్టాండ్‌లో అనువనువుగా పరిశీలించారు. సీఐ కత్తి శ్రీనివాసులు అనుమానితులను ఆరా తీశారు. వారి ఆధార్‌కార్డులను చూసి వివరాలు ఆరా తీసి పంపారు. విలువైన వస్తువులతో ప్రయాణించే మహిళలు, ఐటీ ఉద్యోగులకు సూచనలు, సలహాలు చేశారు. ప్రయాణంలో అలసిపోయి నిద్రలోకి జారుకుంటే చేతివాటం ప్రదర్శించే దొంగలుంటారన్నారు. అత్యవసర సమయాల్లో ఉచిత డయల్ 100 సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

కుంటెమ్మ తల్లికి బోనాలు



అలంకార సేవల్లో పూజలందుకున్న కుంటెమ్మతల్లి

అనంతపురం కల్చరల్: స్థానిక అంబేడ్కర్ నగర్‌లో వెలసిన శ్రీకుంటెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం నేత్రపర్వంగా జరిగాయి. తెల్లవారు జామున నుంచే అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్ర కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకార సేవల్లో అమ్మవారిని భక్తులు బారులు తీరి దర్శించుకున్నారు. వందలాది మంది కాలనీవాసులు అమ్మవారికి పొంగళ్లు, బోనాలు సమర్పించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ప్రత్యేక పూజలు, భజనల్లో కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు, ఉపాధ్యక్షులు శేఖర్‌బాబు, శ్రీరాములు, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి

రాప్తాడు: మండలంలోని బోమ్మేపర్తికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త చింతకుంట రమాదేవి (55) అనారోగ్యంతో ఆదివారం అర్ధరాత్రి మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. అనంతపురంలో నివాసం ఉంటున్న చింతకుంట రమాదేవి బోమ్మేపర్తి అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తోంది. ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రిలో చికిత్సపొందింది. అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. మృతురాలికి భర్త చెన్నకేశవతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్ వైజర్లు నాగరత్న, ఝాన్సీ గ్రామానికి చేరుకొని రమాదేవి మృతదేహానికి నివాళులర్పించారు.

ఇంటిపట్టాలు మంజూరు చేయాలి



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శీరధరమూర్తి

రాప్తాడురూరల్: అర్హులకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలని సీపీఎం ఒకటో నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ శ్రీధరమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ శ్రీశ్రీ నగర్‌కు త్వరలోనే ఇంటి పట్టాలు ఇస్తామన్నారు. ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న గుడిసెలను పరిశీలించి, అర్హులకు పట్టాలు ఇస్తామన్నారు. మన్నీలలో పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి, స్థలాలు చూపించలేదని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో సీపీఎం నగర నాయకులు మన్నీల రామాంజి, ప్రకాష్, వలీ, మసూద్, బాబు, జీవ, శీను, ఆటో యూనియన్ శివ, వన్నూరు, పాండు ఉన్నారు.

సురక్షిత ప్రయాణానికి మార్గం సుగమం

- 40 ఏళ్లుగా తారురోడ్డుకు నోచుకోని రహదారికి మోక్షం
- రూ. 1.41 కోట్లతో అక్కంపల్లి - రాచానపల్లి రోడ్డు నిర్మాణం
- వేగంగా జరుగుతున్న పనులు
- రూ.1.96 కోట్లతో ఎస్ఎస్‌కుంట క్రాస్ వరకు తారురోడ్డు
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రత్యేక చొరవ



అక్కంపల్లి-రాచానపల్లి తారురోడ్డు నిర్మాణంలో భాగంగా పూర్తయిన మట్టిరోడ్డు

రాప్తాడురూరల్: అనంతపురం నగరానికి కేవలం 5 కిలోమీటర్ల దూరం కళ్యాణదుర్గం రోడ్డు నుంచి అక్కంపల్లి మీదుగా రాచానపల్లికి వెళ్లేదారి 40 ఏళ్లుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఈ రోడ్డు ఇటు అనంతపురం-కళ్యాణదుర్గం అటు అనంతపురం-బళ్లారి రోడ్డు వరకు కలుస్తుంది. గతంలో మట్టిరోడ్డు వేసినా అది పూర్తిగా దెబ్బతిని రోడ్డంతా గుంతలు, కంకరమయమైంది. నాలుగు చక్రాల వాహనాలు కాదుకదా.. కనీసం ద్విచక్రవాహనంపై వెళ్లాలన్నా సాహసం చేయాల్సిన పరిస్థితి. కళ్యాణదుర్గం రోడ్డు నుంచి అక్కంపల్లి మీదుగా రాచానపల్లికి వెళ్లాలంటే 2.5 కిలో మీటర్ల దూరం ఉంది. లింకు రోడ్డు సరిగా లేకపోవడంతో అక్కంపల్లి నుంచి రాచానపల్లి వెళ్లాలంటే దాదాపు 7 కిలోమీటర్ల దూరం చుట్టేసి వెళ్లాల్సి వస్తోంది. రాచానపల్లి, అక్కంపల్లి గ్రామాల ప్రజలు ఎప్పటి నుంచి తారురోడ్డు కోసం విన్నవిస్తున్నా లాభం లేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్ ప్రాజెక్ట్ (ఏపీఆర్ఆర్‌పీ) రూ.కోటి 41 లక్షల నిధులు మంజూరు చేశారు. మెటల్ రోడ్డు పనులు పూర్తయ్యాయి. మరో పది రోజుల్లో తారు రోడ్డు పూర్తవుతుందని అధికారులు చెప్తున్నారు.

ఎన్‌హెచ్ 44 నుంచి ఎస్ఎస్‌కుంట రోడ్డుకు మహర్దశ

జాతీయ రహదారి 44 నుంచి సోములదొడ్డి, నాగిరెడ్డిపల్లి మీదుగా నరసనాయనికుంట క్రాస్ వరకు ఉన్న తారురోడ్డు మహర్దశ తిరగనుంది. దాదాపు 20 ఏళ్ల కిందట నిర్మించిన రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కృషితో ఏపీఆర్ఆర్‌పీ కింద రూ.1.96 కోట్లు నిధులు మంజూరయ్యాయి. దాదాపు 2 కిలో మీటర్ల దూరం రోడ్డును నిర్మించనున్నారు. ఇదికూడా మట్టి పనులు పూర్తయ్యాయి. పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ రెండు పనులను విశ్వాసముద్ర కన్‌స్ట్రక్షన్స్ వారు చేపట్టారు. ఎప్పటి నుంచో గుంతలమయమైన రోడ్లను నిర్మిస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకున్నారు

అక్కంపల్లి-రాచానపల్లి రోడ్డు విషయమై గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ రోడ్డుగుండా నిత్యం రాకపోకలు సాగుతున్నాయి. రోడ్డు సరిగా లేక రవాణాకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే కాగానే గ్రామస్తులతో కలిసి వెళ్లి విన్నవించాం. వెంటనే చొరవ తీసుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి రోడ్డు మంజూరు చేయించారు. పనులు వేగంగా జరుగుతున్నాయి.

– అంజి (బండ), రాచానపల్లి సర్పంచ్

కావాలనే మజ్జిగ, నీటిని పారబోశారు

- ఆ నెపం పోలీసులపై నెట్టి టీడీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారు
- అనంతపురం రూరల్ సీఐ విజయభాస్కర్‌గౌడ్

రాప్తాడు రూరల్: అనంతపురం మండలం సోములదొడ్డి పంచాయతీ పరిధిలోని తడకలేరు తిరునాళ్లలో కొందరు స్థానిక టీడీపీ నాయకులు చలివేంద్రంలో మజ్జిగ, నీటిని కావాలనే కింద పారబోసి ఆ నెపం పోలీసులపై నెట్టి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారని అనంతపురం రూరల్ పీఎస్ సీఐ విజయభాస్కర్‌గౌడ్ మండిపడ్డారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తిరునాల జరుగుతున్న ప్రాంతంలో ప్రధాన రోడ్డుపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని స్థానికులకు ముందుగానే తెలియజేశామన్నారు. పోలీసుల వినతిని మన్నించి ఎవరూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకపోయినా.. కొందరు టీడీపీ నాయకులు మాత్రం కల్వర్టు మీద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారన్నారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉండడంతో ఫ్లెక్సీని వారితోనే తీసేయించామన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అక్కసుతో చలివేంద్రంలోని మజ్జిగ, తాగునీటిని పారబోసి, షామియాను తొలగించుకుని తమకు అనుకూలమైన సామాజిక మాధ్యమాల్లో పోలీసులతో పాటు ఎమ్మెల్యేకు విరుద్ధంగా ప్రచారం చేశారన్నారు. ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

మిగులు భూమికి పట్టాలు ఇవ్వండి

అనంతపురం అర్బన్: కూడేరు మండలం లెప్రసీ కాలనీలో నివాసముంటున్న తమకు అక్కడి మిగులు భూమిలో సాగుకు పట్టా ఇవ్వాలని ఆర్డీఓ మధుసూదన్‌కు కాలనీవాసులు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్ వద్ద బైఠాయించారు. వారి వద్దకు ఆర్డీఓ రావడంతో రామకృష్ణారెడ్డి, కృష్ణ, సుబ్బరాయుడు, ఈరన్న, శీన, తదితరులు వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బ్రాహ్మణపల్లి లెప్రసీ కాలనీ వద్ద ఉన్న ప్రభుత్వ భూమిలో 20 కుటుంబాలకు జీవనాధారంగా ఒక్కొక్కరికి 1.18 ఎకరాల చొప్పున పొలం ఇచ్చారన్నారు. మరో 20 కుటుంబాలకు భూమి లేదన్నారు.